సాక్షి
విజయనగరం
ఆదివారం । 11 । ఆగస్టు । 2024



మృత్యువుతో పోరాటం..
కొద్దిరోజుల కిందటి వరకు భార్య, ఇద్దరు ఆడపిల్లలతో అతను ఎంతో ఆనందంగా జీవనం సాగించాడు. - 8లో



ప్రజారోగ్యమే ధ్యేయం..
ప్రజారోగ్యమే ధ్యేయంగా ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ జగన్ మోహనరావు సూచించారు. - 8లో



ముగిసిన తైక్వాండో పోటీలు
జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ తైక్వాండో పోటీలు శనివారంతో ముగిశాయి. - 8లో

న్యూస్‌రీల్

మోదమ్మను దర్శించుకున్న న్యాయమూర్తి దుర్గయ్య



మోదకొండమ్మతల్లిని దర్శించుకున్న విజయనగరం జిల్లా అదనపు జడ్జి దుర్గయ్య కుటుంబ సభ్యులు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని విజయనగరం అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దుర్గయ్య కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. శనివారం ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తిని, కుటుంబ సభ్యులను ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం మోదమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువతో సత్కరించి, మోదమ్మ ఫొటో, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, న్యాయవాది తమర్బ ప్రసాద్‌నాయుడు, స్థానిక కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనంపై దాడి దుర్మార్గం

- జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జైహింద్‌కుమార్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

విజయనగరం ఫోర్ట్: విజయవాడలోని స్వరాజ్య మైదానంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతివనంపై దాడి చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ పేర్కొన్నారు. దాడిని నిరసిస్తూ అంబేడ్కర్ జంక్షన్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఉండడం కొంతమంది ఓర్వలేక దురుద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరును శిలాఫలకంపై తొలిగించి చిందరవందర చేసారన్నారు. విశ్వజ్ఞాని అంబేడ్కర్ కీర్తి విశ్వమంతా వ్యాప్తిస్తుంటే కులవాదులు ఇలాంటి దుర్మార్గానికి ఒడిగట్టడం సిగ్గుమాలని చర్య అన్నారు. దోషులను శిక్షించి విగ్రహానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు అలమండ మహేష్, దాలిరాజు, అప్పారావు, గురువులు, షణ్ముఖరావు, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కులం.. ధనం!

- జిల్లాలో సబ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్స్‌లో అవే ప్రధానం
- తమ కులపోడే ఎస్సైగా ఉండాలని కూటమి ఎమ్మెల్యేల ఆత్రం
- మనోళ్లేనంటూ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలిప్పిస్తున్న ఓ హెడ్‌కానిస్టేబుల్
- ఇప్పటికే సీఐల పోస్టింగ్స్‌లో అశ్రిత పక్షపాతం
- పని విధానంతో పని లేకుండా నచ్చని వారందరికీ వీఆర్
- సీనియర్ సీఐలను పక్కనబెట్టి జూనియర్లకు కీలక స్థానాలు
- రానున్న ఎస్సైల పోస్టింగ్స్‌లోనూ అదే ధోరణి!



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కులం, లేదంటే ధనం ప్రస్తుతం ఇవే జిల్లాలో పోలీసు శాఖలో పోస్టింగ్స్‌ను నిర్దేశిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు అందుకు బలం చేకూర్చుతున్నాయి. సీఐల పని విధానం, సీనియార్టీ, వ్యవహార ధోరణితో సంబంధం లేకుండా తమ కులపోళ్లను, లేదంటే రాజకీయ దళారులు చెప్పిన వ్యక్తులను కీలక స్థానాల్లో కూర్చోబెట్టడానికి కూటమి ఎమ్మెల్యేలు తాపత్రయపడుతున్నారు. అదే ఊపుతో ఇప్పుడు సబ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్స్ విషయంలోనూ జోక్యం చేసుకుంటున్నారు. మనోళ్లేనంటూ ఓ హెడ్‌కానిస్టేబుల్ ఆయా ఎమ్మెల్యేలతో సిఫారసు లేఖలు ఇప్పిస్తున్నారనేది బహిరంగ రహస్యం. దీనివల్ల జిల్లాలో సీఐలు, ఎస్సైలు ఇబ్బంది పడుతున్నా రెడ్‌బుక్ భయంతో బయటకు చెప్పుకోలేకపోతున్నారు.

అశిత్ర పక్షపాతానికి తార్కాణాలు

- అవినీతి ఆరోపణల నేపథ్యంలో గత ఎస్పీ దీపికా పాటిల్ ఎలక్షన్ సెల్‌కు బదిలీ చేసిన ఓ ఎస్సైను ఇప్పుడు విజయనగరం రూరల్ స్టేషన్‌కు తీసుకురావడానికి టీడీపీ నాయకులు రంగం సిద్ధం చేశారు. వాస్తవానికి సదరు ఎస్సై గతంలో అదే రూరల్ స్టేషన్‌లో పనిచేశారు. అప్పుడు కొంత మంది కానిస్టేబుళ్లు, ఓ హెడ్‌స్టేబుల్‌తో గ్రూప్ పెట్టి భారీగా దందాలు నడిపారనే ఆరోపణలు వచ్చాయి. అదే సమయంలో అక్కడున్న ఎస్‌హెచ్‌వోతోనూ అతనికి పొసగలేదు. దీంతో అక్కడి నుంచి విజయనగరం ఒన్‌టౌన్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు అక్కడా పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఎలక్షన్ సెల్‌కు ఎస్పీ అటాచ్ చేశారు. ఒకసారి ఒక స్టేషన్‌లో పనిచేసిన తర్వాత మళ్లీ అదే స్టేషన్‌లో అదే ర్యాంకుతో సాధారణంగా పోస్టింగ్ ఇవ్వరు. ఎలాగైనా పోస్టింగ్ తెచ్చుకోవాలన్న ఆయన తాపత్రాయాన్ని గమనించిన రాజకీయ దళారిగా ఉన్న ఓ హెడ్‌కానిస్టేబుల్... విజయనగరం ఎమ్మెల్యే సిఫారసు లేఖను ఇప్పించినట్లు విశ్వసనీయ సమాచారం.
- నోరు తెరిస్తే బూతులు, సామాన్య ప్రజలపై చిన్న విషయానికీ విరుచుకుపడే ఓ ఎస్సై బొబ్బిలి టీడీపీ నాయకుడు తెంటు లక్ష్మునాయుడి సహకారంతో తెర్లాం పోలీసుస్టేషన్‌లో పోస్టింగ్ తెచ్చుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పోస్టింగ్ కోసం కొంత సొమ్ము కూడా చేతులు మారాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో సదరు ఎస్సై విజయనగరం టూటౌన్ ఎస్సైగా పనిచేసినప్పుడు కొత్తపేట ప్రాంతంలో న్యూడిల్స్ దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని చితకబాదిన చరిత్ర ఉంది. దీంతో అతన్ని విశాఖపట్నంలో డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేసేశారు. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న సదరు ఎస్సై తెర్లాంలో పోస్టింగ్ కోసం తెంటు లక్ష్మునాయుడి సహకారంతో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన లేఖ సంపాదించినట్లు తెలిసింది.
- గతంలో విజయనగరం వన్‌టౌన్‌లో పనిచేసిన ఓ ఎస్సై గంటస్తంభం వద్ద వాహనం పార్కింగ్ విషయమై తలెత్తిన వివాదంలో ఓ డాక్టర్‌పై చేయిచేసుకోవడమే గాకుండా వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు కాలర్ పట్టుకొని లాక్కెళ్లడం అప్పట్లో సంచలనమైంది. అప్పటి ఎస్పీ దీపికా పాటిల్‌కు అందిన ఫిర్యాదుతో సదరు ఎస్సైను జిల్లా శిక్షణా కేంద్రానికి (డీటీసీ) పంపించారు. ప్రస్తుతం టూటౌన్‌లో పనిచేస్తున్న అతనికి పూసపాటిరేగ పోలీసు స్టేషన్‌లో పోస్టింగ్ కోసం నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి సిఫారసు లేఖ ఇచ్చినట్లు తెలిసింది. కులం కార్డుతో ఇటీవల భోగాపురంలో పోస్టింగ్ పొందిన సీఐయే ఈ ఎస్సైకు కూడా టీడీపీ నాయకుల ద్వారా సిఫారసు లేఖ ఇప్పించినట్లు తెలిసింది. గతంలో సదరు ఎస్సై చీపురుపల్లిలో పనిచేసినప్పుడు అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంలో అతనిపై ఎస్పీకి అప్పటి సీఐ ఫిర్యాదు చేస్తే, అదే సీఐపై సదరు ఎస్సై కూడా ఎదురు ఫిర్యాదు చేయడం అప్పట్లో సంచలనమైంది. దీంతో ఆ ఎస్సైను సీసీఎస్‌కు బదిలీ చేశారు.



ఎస్పీ ఏం చేస్తారో...

నిబద్ధతకు, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తున్న కొత్త ఎస్పీ వకుల్ జిందాల్ ముక్కుసూటిగానే వ్యవహరిస్తున్నారనే పేరుంది. కానీ ప్రస్తుతం కొంతమంది సీఐలు, ఎస్సైలు కులం, ధనం ప్రాతిపదికన కీలక స్థానాల్లో పోస్టింగ్ తెచ్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలపై ఏం చేస్తారోననే చర్చ పోలీసు వర్గాల్లో జరుగుతోంది. అలా గాకుండా కూటమి నాయకుల సిఫారసులతో అవినీతి ఆరోపణలు వచ్చినవారిని, వివాదాస్పద పోలీసు అధికారులను కీలక స్థానాల్లో నియమిస్తే దానివల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పవు.

రాష్ట్రంలో విధ్వంసకర పాలన



అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు

- రాష్ట్రంలో చీకటి రోజులు
- ఆస్తుల ధ్వంసం, హత్యలే అజెండాగా కూటమి పాలన
- అంబేడ్కర్ విగ్రహంపై దాడి సిగ్గుచేటు
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ, క్షీరాభిషేకం

చీపురుపల్లి: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల కాలంలో దాడులు, విధ్వంసాలు తప్ప ప్రజా పరిపాలన గాలికొదిలేసారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. విజయవాడలోని మహా అంబేడ్కర్ విగ్రహం వద్ద పోలీసుల సమక్షంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఉన్న శిలాఫలకాలపై దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని బాబాసాహేబ్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసారు. అనంతరం అక్కడి నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి లావేరు రోడ్ మీదుగా మూడు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేసారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే సమాజం తలదించుకునే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గడిచిన రెండు నెలలుగా రాష్ట్రంలో ఎక్కడ చూసినా విధ్వంసాలు, దాడులు, హత్యలు తప్ప ప్రజాపరిపాలన గాలికొదిలేసారన్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అతి ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి రాజ్యాంగ నిర్మాతపై ప్రభుత్వానికి ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం నుంచి హత్యలు, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు ఓ వైపు జరుగుతూనే ప్రజాస్వామ్యం తలదించుకునే విధంగా అంబేడ్కర్ విగ్రహంపై దాడికి తెగబడడం దారుణమన్నారు. దీని కారణంగా రాష్ట్రంలో చీకటి రోజులు ఏర్పడ్డాయన్నారు. ఎన్నికల ముందు ప్రజలు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేదని ప్రస్తుత ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం ఇంతవరకు విచారణకు ఆదేశించకపోవడం దారుణమన్నారు. శిలాఫలకాలపై పేర్లు తొలగించినంత మాత్రాన జగన్‌మోహన్‌రెడ్డి పేరును ప్రజల గుండెల్లో నుంచి తీయలేరని స్పష్టం చేసారు. తక్షణమే ప్రభుత్వం ఆ ఘటనపై విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలన్నారు.

రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన

ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేయించడం, వైఎస్సార్‌సీపీ నాయకులను హత్య చేయించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం పరిపాటిగా మారిందని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. సమాజం తలదించుకునే విధంగా అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన ఘటన నిలుస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలకే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. విశాఖపట్టణంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీకు ఎలాంటి బలం లేకపోయినప్పటికీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడుతుండడం చూస్తుంటే అడ్డదారిలో గెలవాలని ప్రయత్నిస్తున్నట్టు అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో గరివిడి, గుర్ల జెడ్పీటీసీలు వాకాడ శ్రీనివాసరావు, శీర అప్పలనాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వి.రమణరాజు, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల నాయకులు మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, గవిడి సురేష్, మీసాల విశ్వేశ్వరరావు, కోట్ల వెంకటరావు, కొణిశ కృష్ణంనాయుడు, లెంక శ్రీరాములు, యడ్ల అప్పారావు, పొన్నాడ కుమార్, రాంబాబు, తమ్మినాయుడు, పిఎస్‌ఆర్‌కె.ప్రసాద్, కొమ్ము శంకరరావు, పొట్నూరు సన్యాశప్పలనాయుడు, స్వామినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, దళిత సంఘ నాయకులు కోరుకొండ భారతి, అడ్డూరి కృష్ణ, లక్ష్మణ, రేగిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మూడు రోడ్ల జంక్షన్‌లో మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న నాయకులు

సమగ్ర గణన చేపట్టాలి



శిక్షణలో మాట్లాడుతున్న జేడీ మన్మథరావు

పాలకొండ రూరల్: ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే పశు గణన సమగ్ర సమాచారంతో చేపట్టాలని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్(జేడీ) శివ్వాల మన్మథరావు స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న పశు గణనకు సంబంధించి తమ సిబ్బందికి ఆ శాఖ సహాయ సంచాలకులు ప్రభ మాణిక్యరావు నేతృత్వంలో పాలకొండలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 2 లక్షల 69వేల 677 కుటుంబాలకు తమ శాఖ ఎంపిక చేయటం జరిగిందన్నారు. ఈ క్రమంలో గణన చేపట్టేందుకు వీరి నుంచి 294 మంది ఎన్యుమరేటర్లు, 25 మంది సూపర్‌వైజర్లు ఏర్పాటు చేశామన్నారు. వీరు ప్రతీ ఇంటిని సందర్శించి ఆయా గృహాల్లో పెంచుతున్న పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు తదితర జీవాల సంఖ్యను నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ మొబైల్ యాప్‌లో ఉంటుందన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి 21 వరకూ 15 అంశాలతో కూడిన గణన చేపడతారని తెలిపారు. శిక్షణలో పాలకొండ, సీతంపేట, వీరఘట్టం, భామిని మండలాలకు చెందిన వైద్యులు, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎడతెగని జాప్యం!



వ్యవసాయ పంపు సెట్టు

- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో...
- జిల్లాలో 253 కనెక్షన్లు పెండింగ్
- ప్రస్తుత సీజన్‌లో సాగుకు అత్యవసరం

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయంలో విద్యుత్ రంగానిది కీలక పాత్ర. వ్యవసాయ పంపు సెట్లు ద్వారా పంటల సాగు చేపట్టాలంటే విద్యుత్ అవసరం. వర్షాభావ పరిస్థితుల్లో పంటలను రైతులు వ్యవసాయ పంపు సెట్లు ద్వారా నీరు అందించి కాపాడుకుంటారు. జిల్లాలో అధిక శాతం వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ప్రాధాన్యత ఉంది. ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఇప్పుడు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు రైతులకు ఎంతగానో అవసరం. అయితే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో విద్యుత్ శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదో కారణం చెప్పి విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయడంలో అలసత్వం వహిస్తున్నరనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వల్ల రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి.

పెండింగ్‌లో 253 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసిన వందలాది మంది రైతులు మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. విద్యుత్ శాఖ వద్ద 253 విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. విజయనగరం టౌన్ డివిజన్‌లో అధికంగా 95 పెండింగ్‌లో ఉన్నాయి.

ముమ్మరంగా సాగు పనులు

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొన్ని చోట్ల వరి పంటకు సంబంధించి దమ్ము చేసి నాట్లు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల డ్రమ్ సీడర్ ద్వారా వరిని విత్తుతున్నారు. వర్షం తక్కువగా ఉన్న చోట రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఉన్నట్టయితే నీటిని సాగుకు అందించేందుకు వీలుగా ఉంటుంది. లేకపోతే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 55,109 ఉన్నాయి. విజయనగరం టౌన్ డివిజన్‌లో 15,011 ఉన్నాయి. విజయనగరం రూరల్ డివిజన్‌లో 13,042 ఉన్నాయి. బొబ్బిలి డివిజన్‌లో 8,237 ఉన్నాయి. పార్వతీపురం డివిజన్‌లో 18,819 కనెక్షన్లు ఉన్నాయి.

పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కనెక్షన్ల వివరాలు

డివిజన్	పెండింగ్ కనెక్షన్ల సంఖ్య
విజయనగరం టౌన్	95
విజయనగరం రూరల్	53
బొబ్బిలి	29
పార్వతీపురం	76

గడువు కంటే ఆలస్యం

విద్యుత్ స్తంభాలు తరలించడానికి వీలు లేని చోట్ల విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం గడువు కంటే ఆలస్యమవుతుంది. విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి అనువుగా ఉంటే నెల రోజుల్లోనే రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లు త్వరితగతిన వేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ముప్పల లక్ష్మణరావు, ఎస్ఈ

సర్దుకునేలోపే.. పంపించేస్తున్నారు..!

- ఐటీడీఏ పీవోలతో బంతాట
- రోజుల వ్యవధిలోనే బదిలీలు
- అధికార వర్గాల్లోనూ జోరుగా చర్చ



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న పీవో రాహుల్‌కుమార్ రెడ్డి(ఫైల్)

సాక్షి, పార్వతీపురం మన్యం : వారంతా ఐఏఎస్ అధికారులు.. గిరిజన ప్రాంతాల్లో కీలకమైన ఐటీడీఏలకు పీవోలుగా వ్యవహరిస్తున్నారు. అటువంటి వారితో కూటమి ప్రభుత్వం బంతాట ఆడుతోంది. రోజుల వ్యవధిలోనే మార్పులు, చేర్పులు చేసి పడేస్తోంది. ఒక చోటకు బదిలీ చేయడం.. వారు తమ ఐటీడీఏలో ఇంకా కుర్చీలోనైనా పూర్తిస్థాయిలో కూర్చోక ముందే.. మరో చోటకు బదిలీ చేసేయడం జిల్లాలో ఇటీవల కాలంలో సర్వసాధారణమైపోయింది. దీంతో ఎప్పుడు ఎవరుంటారో.. ఎవరు వెళ్తారో అక్కడ పని చేస్తున్న పీవోలతో పాటు ఉద్యోగులకు సైతం అంతుబట్టడం లేదు.

రెండు ఐటీడీఏలు.. ఐదుగురు పీవోలు

పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురంతో పాటు.. సీతంపేట ఐటీడీఏలున్నాయి. పార్వతీపురం ఐటీడీఏకు సంబంధించి ఎన్నికల సమయం వరకు ఇక్కడ పీవోగా విష్ణు చరణ్ బాధ్యతలు స్వీకరించారు. గత నెల 20న జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో ఆయనను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ స్థానంలో సేదు మాధవన్ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన 20 రోజుల్లోపే ఆయన్ను బదిలీ చేశారు. సేదు మాధవన్‌ను విజయనగరం జిల్లా సంయుక్త కలెక్టర్‌గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సీతంపేట ఐటీడీఏ విషయానికొస్తే.. గత ఎన్నికల సమయంలో పీవోగా వ్యవహరించిన కల్పనాకుమారిని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆకస్మాత్తుగా బదిలీ చేశారు. తర్వాత చాలా రోజుల వరకు ఆమెకు పోస్టింగు ఇవ్వలేదు. ఆమె స్థానంలో శుభం బన్సల్‌ను నియమించారు. కొద్దిరోజులకే ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవుపై వెళ్లిపోయారు. చాలా రోజుల పాటు ఇన్‌చార్జి పీవోగా పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణు చరణ్ వ్యవహరించారు. గత నెల 20న చేపట్టిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా సీతంపేటకు 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన టి.రాహుల్‌కుమార్ రెడ్డిని నియమించారు. సెలవుపై వెళ్లిన శుభం బన్సల్ మరలా ఇక్కడికి రాకుండానే బదిలీ అయిపోవడం గమనార్హం. తాజాగా జరిగిన బదిలీల్లో రాహుల్‌కుమార్‌రెడ్డిని సైతం పశ్చిమగోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్‌గా పంపించేయడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ప్రసుత్తం పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు కొత్తగా ఎవరినీ నియమించకపోవడం విశేషం.

పట్టు సాధించేలోపే..

ఇక్కడికి బదిలీపై వస్తున్న పీవోల్లో యువ ఐఏఎస్‌లే అధికంగా ఉంటున్నారు. ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో.. గిరిజనుల కోసం ఏదైనా చేయాలన్న తలంపుతో కార్యాచరణకు దిగుతున్నారు. విధుల్లో చేరిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. గిరిజనులతో మమేకమవుతున్నారు. ఇక్కడ వనరులు ఏమేం ఉన్నాయి.. వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలి.. గిరిజనుల జీవన స్థితిగతులను ఎలా మార్చాలి.. అనే అంశాలపై ఒక అభిప్రాయానికి వచ్చేలోపే.. వారు బదిలీపై వెళ్లిపోతుండటం గమనార్హం. కనీసం, తమ కుర్చీలో పూర్తిగా సర్దుకునేలోపే.. వారి తట్టాబుట్టాను సర్దించేస్తున్నారన్న చర్చ ఉద్యోగ వర్గాల్లోనూ, అటు ఆదివాసీ సంఘాల్లోనూ వ్యక్తమవుతోంది. ఇలాగైతే.. తమ సమస్యలు ఎవరికి చెప్పుకుంటామని, వారు ఎలా పరిష్కరిస్తారని గిరిజన సంఘాల నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఐటీడీఏలంటే నిర్లక్ష్యమా, గిరిజనులంటే చిన్నచూపా? అంటూ ప్రశ్నలు కురిపిస్తున్నారు.

క్లుప్తంగా

వినతులు స్వీకరించిన మంత్రి కొండపల్లి



వినతులు స్వీకరిస్తున్న మంత్రి కొండపల్లి

విజయనగరం అర్బన్: రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మంత్రిని కలసి తమ సమస్యలను విన్నవించారు.

కలెక్టరేట్‌లో రేపు..

మంత్రి కొండపల్లి ఈ నెల 12న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు మంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తారని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు.

రాత్రి 11 గంటల తర్వాత దుకాణాల బంద్..

- అనుమానాస్పదంగా సంచరించినా చర్యలు తప్పవు
- ఎస్పీ వకుల్ జిందల్



వకుల్ జిందల్, ఎస్పీ

విజయనగరం క్రైమ్: జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో రాత్రి 11 గంటల తర్వాత ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో సంచరించినా, వ్యాపారాలు సాగించినా వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. శనివారం తన కార్యాలయం నుంచి పోలీస్ అధికారులతో మాట్లాడారు. శాంతి,భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా కొన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాత్రి సమయాల్లో యువత పట్టణాల్లో సహేతుకరమైన కారణాలు లేకుండా విచ్చలవిడిగా తిరుగుతున్నారని తెలిపారు. రాత్రి గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించే పోలీస్ సిబ్బంది, అధికారులు ఇటువంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాత్రి 11 గంటల తర్వాత పట్టణాల్లో ఎటువంటి వ్యాపారాలు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనుమానాస్పదంగా సంచరించినా కేసులు నమోదు చేయాలని సూచించారు. అంతేకాకుండా మద్యం మత్తులో వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణమవుతున్న వాహనదారులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొండపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని అంబటివలస గ్రామానికి చెందిన కందుకూరి రామారావు (45) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. రామారావు ఈనెల 8వతేదిన గ్రామానికి ఆనుకుని ఉన్న జాతీయ రహదారి–26పై నడిచి వెళుతుండగా జామి మండలానికి చెందిన ద్విచక్ర వాహనచోదకుడు గజపతినగరం వైపు వెళుతూ వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో రామారావు తలకు తీవ్ర గాయాలు కావడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ప్రమాద సంఘటనపై కేసు నమోదు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో ఈ నెల 4వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి, కేసు నమోదు చేశామని సీఐ డి.మోహనరావు శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా.. లావేరు మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన చందక లక్ష్మునాయుడు బొబ్బిలి నుంచి రాజాం మీదుగా వెంకటాపురానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. రాజాం పట్టణ పరిధిలోని వస్త్రపురికాలనీ సమీపానికి వచ్చేసరికి ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి ఢీకొనడంతో లక్ష్మునాయుడు కాలికి బలమైన గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారన్నారు. ఈ మేరకు బాధితుని భార్య మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అలాగే మండలంలోని ఒమ్మి గ్రామంలో జరిగిన వ్యవసాయ మోటారు అపహరణపై శనివారం కేసు నమోదు చేశామని సీఐ డి.మోహనరావు తెలిపారు. గ్రామానికి చెందిన వంగా మహేష్ పొలంలోని మోటార్‌ను జూలై 30వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారన్నారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹98	₹166	₹176

మృత్యువుతో పోరాటం..



కాళ్లు, చేతులు కోల్పోయి దీనావస్థలో ఉన్న ఫణిధర్



భార్య అనిత,ఇద్దరు ఆడపిల్లలతో ఫణిధర్ (ఫైల్)

- విద్యుత్ షాక్‌తో చేతులు, కాళ్లు కోల్పోయిన పంచాయతీ కార్యదర్శి
- ఆర్థిక సమస్యలతో దిక్కుతోచని స్థితిలో కుటుంబం
- దాతల కోసం ఎదురుచూపులు

వీరఘట్టం: కొద్దిరోజుల కిందటి వరకు భార్య, ఇద్దరు ఆడపిల్లలతో అతను ఎంతో ఆనందంగా జీవనం సాగించాడు. వీరి దాంపత్య జీవితంపై కన్నుకుట్టిన దేవుడు విద్యుత్ షాక్ రూపంలో ఆ ఇంటి పెద్దదిక్కును చావుదెబ్బ తీశాడు. దీంతో ఆ ఇంటి పెద్ద దిక్కుగా ఉన్న భర్త కోరాడ ఫణిధర్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. విద్యుత్ షాక్‌తో ప్రాణాపాయం తప్పినప్పటికీ రెండు కాళ్లు, చేతులను వైద్యులు తొలగించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో జీవచ్ఛవంలో ఫణిదర్ కొట్టుమిట్టాడుతున్నాడు. పాలకొండ మండలం గొట్ట మంగళాపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కోరాడ ఫణిధర్ గత నెల 25న పాలకొండలో తన ఇంటి వద్ద ప్రమాదవశాత్తూ 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలి గాయపడ్డాడు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఫణిధర్ కుటంబ పరిస్థితిని చూసి సహచర సిబ్బంది కొంతమేర ఆర్థిక సాయం అందజేశారు. గత నెల 30న ఇతనికి రెండు చేతులను వైద్యులు తొలగించారు. ఈ నెల 5న రెండు కాళ్లను కూడా తొలగించారు.

సాయం కోసం ఎదురుచూపులు..

ఫణిధర్‌కు వీరఘట్టానికి చెందిన పట్నాన అనితలో 16 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు కాగా.. పెద్దమ్మాయి 8వ తరగతి, చిన్నమ్మాయి ఆరో తరగతి చదువుతున్నారు. ఇప్పుడు కుటుంబ భారం అంతా భార్యపై పడింది. కాళ్లు, చేతులు లేక మృత్యువుతో పోరాడుతున్న భర్త ఓ వైపు, చదువుకుంటున్న ఇద్దరు ఆడపిల్లలు మరో వైపు.. దీంతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలో తెలియక అనిత కన్నీరుమున్నీరవుతోంది. ప్రభుత్వం నుంచి, దాతల నుంచి సహాయం కోసం ఆమె ఎదురుచూస్తున్నారు. ఎవరైనా ఈ కుటుంబానికి సాయం చేయాలంటే 62816 91501 నంబర్‌ను సంప్రదించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయం..



స్థానికుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ జగన్ మోహనరావు

- మాతా, శిశు ఆరోగ్యంపై పర్యవేక్షణ తప్పనిసరి
- డిప్యూటీ డీఎంహెచ్ఓ టి. జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: ప్రజారోగ్యమే ధ్యేయంగా ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ టి. జగన్ మోహనరావు సూచించారు. మండలంలో వెంకటరాయుడుపేట గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామంలో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల ప్రభావం ఏమైనా ఉందా.. శానిటేషన్ తీరు, స్ప్రేయింగ్ నిర్వహణ, తదితర వివరాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్య సిబ్బంది నిర్వహించిన సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆర్‌సీహెచ్, ఎంసీపీ రికార్డుల్లో గర్భిణులు, పిల్లల టీకాల గడువు తేదీలు, టీకాలు వేస్తున్న తేదీలతో సరి చూశారు. చిన్నారులు, గర్భిణుల్లో రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎస్‌ఎం రామలక్ష్మి, ఆశ కార్యకర్త, సీహెచ్‌డబ్ల్యూ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ దాడులు

విజయనగరం క్రైమ్: ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ టీమ్ జిల్లా వ్యాప్తంగా శనివారం దాడులు చేపట్టింది. భోగాపురం మండలం బసవపాలెం గ్రామశివారులోని జీడితోటలో పేకాటాడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని 1,26,500 నగదు, 11 ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. గంట్యాడ మండలం రామవరం గ్రామం వద్ద ఎస్సై బి.సురేంద్ర నాయుడు వాహన తనిఖీలు చేపట్టారు. తమిళనాడుకు చెందిన ఒక వ్యాపారి కంటైనర్‌లో 40 పశువులను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి కంటైనర్‌ను సీజ్ చేశారు. నెల్లిమర్ల ఎస్సై రామగణేష్ ఆధ్వర్యంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని ఒక లారీని, పదిటన్నుల ఇసుకను సీజ్ చేశారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కొత్తపేట మంటపం వద్ద టూటౌన్ ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టి 2500 కిలోల పీడీఎస్ బియ్యం, బొలేరో వాహనాన్ని సీజ్ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు, డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు చేపట్టి నిబంధనలు అతిక్రమించిన 339 మందికి రూ.95, 455 ఈ చలానాలను విధించారు.

ఎగువ దాగరవలసలో డెంగీ కేసు నమోదు

సాలూరు రూరల్: మండలంలోని కొత్తవలస పంచాయతీ ఎగువ దాగరవలస గ్రామంలో డెంగీ కేసు నమోదైనట్లు మామిడిపల్లి పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ, ఆశ వర్కర్లు ఈ నెల ఐదో తేదీన ఇంటింట ఫీవర్ సర్వే చేపట్టగా.. గ్రామానికి చెందిన చింతల చంద్రమ్మ (23) కడుపునొప్పితో బాధపడుతున్నట్లు గుర్తించి, విజయనగరం ఘోషా ఆస్పత్రిలో చేర్పించారన్నారు. అయితే ఈ నెల 9న ఆమెకు మరోసారి పరీక్షలు నిర్వహించగా డెంగీ సోకినట్లు గుర్తించారని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై నిరసన



మానవహారంగా ఏర్పడిన దళితుల సంఘాల నాయకులు

- పాలకొండలో భారీ ర్యాలీ

పాలకొండ రూరల్: ఎస్సీ వర్గీకరణ తీర్పును అత్యున్నత న్యాయస్థానం పునః సమీక్షించాలని దళితులు కోరారు. ఈ అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పాలకొండలో శనివారం నిరసన తెలిపారు. స్థానిక వైఎస్సార్ కార్గిల్ కూడలి నుంచి యాలాం కూడలి వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వరకు పెద్దెత్తున ర్యాలీ చేపట్టారు. ఈక్రమంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. దీనికి తోడు రాష్ట్రంలో జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేపడతామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ అంశమై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు ఎద్దు లిల్లీ పుష్పనాథం, నూతలపాటి భరత్ భూషణరాజు, తదితరులు మాట్లాడుతూ.. వర్గీకరణ వద్దు. కలసి ఉండడమే ముద్దని నినదించారు. మాజీ ఎంపీ హర్షకుమార్ నాయకత్వంలో ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో దళిత సంఘాల జిల్లా, ముఖ్య నాయకుల బత్తిన మోహనరావు, ఉపేంద్రకుమార్, కొంచాడ జాన్, రామారావు, నాగరాజు, ప్రసాద్, రవికుమార్, గణేషబాబు, జీవరత్నంతో పాటు దళితులు పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బ్యాగ్‌లో ఉన్న రూ. 50 వేల నగదు, అరతులం బంగారు శతమానాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఈ నెల 8న ప్రదీప్‌నగర్‌కి చెందిన బెహర మంగ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన వన్‌టౌన్ పోలీసులు ఎర్రసాని ఎర్రమ్మ, యర్రుల సాయికుమారి, ఉయ్యాల దుర్గమ్మ, ఒక బాలికను శనివారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 50 వేల నగదు, అరతులం బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఎస్. శ్రీనివాస్ శనివారం వివరాలు వెల్లడించారు. నిందితులు తాడేపల్లిగూడెంనకు చెందిన వారని, రద్దీ ప్రదేశాల్లో ప్రయాణికుల్లా నటించి ఆర్టీసీ బస్సుల వద్ద, ఆటోస్టాండ్‌ల వద్ద ప్రయాణికుల నగదు, బంగారు నగలను తస్కరిస్తుంటారని చెప్పారు. ప్రజలు తమ విలువైన వస్తువులను తీసుకెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నేరం జరిగిన 48 గంటల్లోపు కేసును ఛేదించిన ఎస్సై తారకేశ్వరరావు, సిబ్బంది శ్రీదేవి, శ్రీను, గౌరీలను డీఎస్పీ అభినందించారన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యమివ్వండి

విజయనగరం అర్బన్: నామినేటెడ్ పోస్టుల భర్తీలో వెలమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యమివ్వాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు మన్మధరావు కోరారు. ఇదే విషయమై ఆయన శనివారం మాట్లాడుతూ బీసీ–డిలో ఉన్న వెలమలను బీసీ–ఏ కేటగిరీలోకి మార్చాలన్నారు. స్వతహాగా తెలివైన ఓసీలను బీసీ–డిలో చేర్చడం వల్ల వ్యవసాయమే జీవనాధారంగా బతికే వెలమలు వారితో పోటీ పడలేకపోతున్నారన్నారు. అన్ని కులాలకు న్యాయం చేసినట్లే వెలమలకు కూడా న్యాయం చేయాలని కోరారు.

ముగిసిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీల విజేతలతో నగర మేయర్ విజయలక్ష్మి, తదితరులు

- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన నగర మేయర్

విజయనగరం: జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ తైక్వాండో పోటీలు శనివారంతో ముగిశాయి. రెండు రోజులుగా జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో విజేతలకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అంతర్జాతీయ క్రీడాకారుడు రషీద్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. నేటి తరం యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పలు రంగాల్లో ప్రతిభ, పాటవాలు కనబరిచినప్పుడే ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోగలరని చెప్పారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రానున్న రోజుల్లో మరింత కఠిన సాధనతో అద్భుత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు విజయనగరంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి డీవీ చారిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు ఈ నెల 16, 17, 18 తేదీల్లో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుంకరి సతీష్, జిల్లా తైకాండో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పట్టణ క్రీడాకారుల ప్రతిభ



పతకాలతో విజేతలు

విజయనగరం అర్బన్: అనంతపురంలో ఈ నెల 3న జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన గురజాడ పాఠశాల విద్యార్థులు వై.కారుణ్య సిల్వర్, తేజస్వి బ్రాంజ్ మెడల్ సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ పూడి శేఖర్ తెలిపారు. అదేవిధంగా ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన తైకాండో పోటీలలో వై.కారుణ్య, తేజస్విని, విశాల్, జయవర్ధన్, తదితరులు పతకాలు సాధించారని చెప్పారు. ఈమేరకు విద్యార్థులను శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు పలువురి ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలను శనివారం నిర్వహించారు. పలువురు క్రీడాకారులు ఎంపిక పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. మహిళల విభాగంలో 40 కిలోల కేటగిరీలో ఒకరు, 45 కిలోల కేటగిరీలో ముగ్గురు, 49 కిలోల కేటగిరీలో ఇద్దరు, 55 కిలోల కేటగిరీలో ఇద్దరు, 59 కిలోల కేటగిరీలో ముగ్గురు, 64 కిలోల కేటగిరీలో ఇద్దరు, 71 కిలోల కేటగిరీలో ఒకరు, 81 కిలోల కేటగిరీలో ఒకరు, 87 కిలోల కేటగిరీలో ఒకరు, 89 కిలోల కేటగిరీలో ఇద్దరు చొప్పున ఎంపికైనట్లు కోచ్ చల్లా రాము తెలిపారు. పురుషుల విభాగంలో 49 కిలోల కేటగిరీలో ఇద్దరు, 55 కిలోల కేటగిరీలో ఇద్దరు, 61 కిలోల కేటగిరీలో ముగ్గురు, 67 కిలోల కేటగిరీలో ఇద్దరు, 73 కిలోల కేటగిరీలో ముగ్గురు, 81 కిలోల కేటగిరీలో ఇద్దరు, 89 కిలోల కేటగిరీలో ఇద్దరు చొప్పున ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి అనకాపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి



ఈరోతు కార్తీక్ (ఫైల్)

భామిని: మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన యువకుడు ఈరోతు కార్తీక్ (28) రైలు కింద పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... ఐటీఐ పూర్తి చేసిన కార్తీక్ మూడేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం స్వగ్రామానికి రావడానికి బయలుదేరిన కార్తీక్ శుక్రవారం రాత్రి ఆముదాలవలస రైల్వే ట్రాక్‌పై శవమై కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇదిలా ఉంటే రైల్వే అధికారుల సమాచారం మేరకు గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసింది.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని యువకుడు..

పార్వతీపురం టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. కేంద్రాస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు, మృతుడు బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు.. విశాఖపట్నం జిల్లా కొత్తగాజువాక గణేష్‌నగర్‌కు చెందిన షేక్ రోషన్ (26) కొంతకాలంగా ఇంటి సీలింగ్ పనులు చేసుకుంటూ పట్టణంలోని బంగారమ్మ కాలనీలో నివాసముంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తన పనులు ముగించుకుని వెంకంపేట నుంచి వస్తుండగా బెలగాం శివారులో ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో రోషన్ అక్కడక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరంతో మహిళ మృతి



గువ్వాడ సుమతి (ఫైల్)

భామిని: మండలంలోని గురండి గ్రామంలో అంగన్‌వాడీ సహాయకురాలిగా పనిచేస్తున్న గువ్వాడ సుమతి (37) జ్వరంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సుమతి మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ వైద్యసేవల కోసం కన్నవారి ఊరైన కొరమకు వచ్చింది. ఇక్కడ ఉంటూ కొత్తూరులోని ఓ ప్రైవేట్ వైద్యుడి వద్ద మందులు వాడుతోంది. శనివారం ఉదయం పరిస్థితి విషయమించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆటోలో వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా... ఆయన శ్రీకాకుళం తీసుకెళ్లమని సూచించాడు. దీంతో అదే ఆటోలో శ్రీకాకుళం తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహాన్ని గురండి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. కొరమ మాజీ సర్పంచ్ అగతముడి గోవిందరావు, గురండి సర్పంచ్ జామి బైరాగి, తదితరులు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.